

## వేతనాల కోత తగదు : విఏలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మహిళా మండల సమాఖ్య (వెలుగు) వివోఏల వేతనాల్లో కోత విధించడం తగదని వివోఏల మండల అధ్యక్ష కార్యదర్శులు జ్యోతి, రాజారావు, వివోఏలు లక్ష్మి, సావిత్రి, కాసులమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ,మండలంలో వివోఏలు 57 మంది పని చేస్తున్నామన్నారు. సెర్ప్ నుండి నెలకు గౌరవ వేతనంగా 8 వేలు ఇస్తుంటే మండల ఏపిఎం, సీసీలు, అకౌంటెంట్ కార్యాలయ సిబ్బంది కుమ్మక్కై రకరకాల కారణాలతో ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల నుండి కోత విధిస్తున్నారన్నారు. జిల్లాలో ఎక్కడ లేని విధంగా ముంచింగి పుట్టులోనే కోత విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయంపై స్పందనలో వినతి పత్రం సమర్పించినప్పటికీ కనీస విచారణ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గత కొద్ది నెలల క్రితం ప్రశ్నించినందుకు వివోఏలకు టార్గెట్ చేస్తూ వ్యక్తిగతంగా వేధిస్తున్నారని తెలిపారు.



మాట్లాడుతున్న విఏలు

### నవరత్నాల పేరుతో..

# ఆదిమ తెగలకు పథకాలు రద్దు చేస్తారా

**ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గసభ్యులు అప్పలనర్స**

**-పివిటిజిల సమస్యలపై ఐటిడిఎ వద్ద ఆందోళన - పాడేరు పట్టణంలో భారీ ర్యాలీ**



నినాదాలు చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు, పివిటిజిలు

ప్రజాశక్తి-పాడేరు: నవరత్నాల పేరుతో ఆదిమ తెగల (పివిటిజి) గిరిజనులకు గతంలో ఇచ్చిన వ్యక్తి గత రుణాల పథకాలను రద్దు చేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగదని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు అప్పలనరస అన్నారు. పివిటిజి గిరిజన సమస్యలపై పాడేరు ఐటిడిఏ వద్ద ఆదివాసీ గిరిజన సంఘం నిర్వహించిన చలో ఐటిడిఏ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాడేరులో భారీ ర్యాలీ నిర్వహించారు. గిరిజన సంఘం కార్యాలయం నుండి పాత బస్టాండ్ వరకు మీదుగా పాడేరు ఐటిడిఎ వరకు వేలాదిమంది పివిటిజి గిరిజనులతో నిరసన ప్రదర్శన జరిపారు. అనంతరం పాడేరు ఐటిడిఏ వద్ద రోడ్డుపై బైఠాయించారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మానదాల్ అధ్యక్షతన నిర్వహించిన సభలో . అప్పలనరస మాట్లాడుతూ, పివిజిలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. అంత్యోదయ రేషన్ కార్డులు లేక అర్హులకి ఆదివాసీ గిరిజనులు అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ.. వైద్యం అందరిని పరిస్థితి నెలకొందన్నారు. గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక డోలీ మోత తో ఆసుపత్రికి మోసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. గడపగడపకు వెళ్లి సమస్యలను పరిష్కారం చేస్తున్నామని చెపుతున్న ప్రభుత్వానికి రోడ్, తాగు నీరు, ఇళ్లు, వంతెనల వంటి సమస్యల కనిపించ లేదా అని ప్రశ్నించారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతగిరి జెడ్పీటీసీ డి.గంగరాజు మాట్లాడుతూ, పి.వి.టి.జి సమస్యలపై జిల్లా పరిషత్‌లో ప్రశ్నిస్తామని చెప్పారు. పివిటిజిల సమస్యలపై జిల్లా కలెక్టర్ ఐటిడిఏ పిఒ చొరవ తీసుకోవాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బలదేవ్ మాట్లాడుతూ, పి.వి.టి.జిలకు ప్రత్యేకంగా పాఠశాలలు, కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు పి.లక్కు మాట్లాడుతూ, నవరత్న సర్వేలో కోదు తెగకు గుర్తింపు కాలం లేదన్నారు. దీంతో వివరాలు నమోదు చేయలేదని, ఇది కోదు తెగ ఉనికికే ప్రమాదమన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు లక్కీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్, బాలయ్య, సర్మా నాయడు, రామన్న, సుందర్ రావు, సత్యనారాయణ, చిట్టి బాబు, కొర్ర బాలయ్య, భాష విద్యా వాలంటీర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. శ్రీను, ఎస్.ఎఫ్.ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నారావు, చింతపల్లి మండల మాజీ ఎం.పి.పి బాబు రావు, కాంగ్రెస్ నాయకులు సుబ్బారావు, జనసేన నాయకుడు రాజన్, తదితరులు పాల్గొన్నారు. పివిటిజిల ఆందోళనకు స్పందించిన ఐటిడిఎ పిఒ అభిషేక్ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.



సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇస్తున్న పిఒ అభిషేక్, చిత్రంలో అప్పలనర్స



పోలింగ్ జరిగే గదిని పరిశీలిస్తున్న సిఐ అశోక్‌కుమార్

## ఉప ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు మేజరు పంచాయతీ సర్పంచి పదవిలో శనివారం జరగనున్న ఉప ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల ఏర్పాట్లును పోలింగ్ బూతులను శుక్రవారం జీకే వీధి సిఐ అశోక్ కుమార్ పరిశీలించారు. సీలేరు మేజరు పంచాయతీ సర్పంచ్ పరదేశి కొన్నాళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, సర్పంచ్ పదవికి ఉప ఎన్నికలు నిర్వహణకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం విధితమే. శనివారం సీలేరు ఎంపీపీ స్కూల్లో పోలింగ్ జరగనుంది. ఈ సందర్భంగా సీఐ అశోక్ కుమార్ పోలింగ్ బూతులను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నప్పుడు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా బూతుల్లో విద్యుత్ సౌకర్యం, మంచినీరు తదితర ఏర్పాట్లు చేశారా లేదా అని కార్యదర్శి శ్రీనివాస్‌ను సిఐ అశోక్ కుమార్ అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నిబంధనల ప్రకారం అన్ని రాజకీయ నాయకులు పోలింగ్ బూత్‌కి దూరంగా ఉండాలని సూచించారు. శనివారం జరగనున్న సర్పంచ్ ఉప ఎన్నికల్లో బిజెపి నుంచి పాంగి సుమిత్ర, టిడిపి నుంచి దశరథ్ వైసిపి, కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థిగా పాంగి దుర్జు పోటీలో తలపడుతున్నారు. ఉదయం ఏడు గంటలకు ఓటింగ్ ప్రారంభమై మధ్యాహ్న ఒంటిగంటకు ముగుస్తుంది. అనంతరం 2.30 గంటల ఓట్ల లెక్కింపు అధికారులు ప్రారంభిస్తారు. మూడు పార్టీల్లో గెలుపు ఎవరిది అనేది ఉత్కంఠ భరితంగా మారింది.




మాట్లాడుతున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్తు నాయకులు మురళి

## కోయ భాష ఉపాధ్యాయులను నియమించాలి

ప్రజాశక్తి - చింతూరు

రంపచోడవరం చింతూరు ఐటీడీఏ పరిధిలో ఉన్న పాఠశాలలో కోయ భాష ఉపాధ్యాయులను వెంటనే నియమించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడి మురళి డిమాండ్ చేశారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్, కోయత్తోర్ బాట ఆధ్వర్యంలో చింతూరులోని ఎస్ఎంహెచ్ హాస్టల్లో పీసం దులయ్య ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కోయ భాష రక్షణ కోసం కృషి చేయాలన్నారు. కోయత్తోర్ బాట ఆధ్వర్యంలో 2000 సంవత్సరం నుండి కోయ భాషలో రూపొందించిన పద్యాలు, కథల వల్ల గుర్తింపు లభించిందని తెలిపారు. ఆ పద్యాలను, కథలను ప్రతి పాఠశాలలో బోధించే విధంగా ప్రణాళిక రూపొందించాలని కోరారు. ఎపిపిఎస్‌సి ద్వారా గ్రూప్ -1 సోడి శ్రీవిద్య ఎంపిక కావడం పట్ల జాతి గర్విస్తుందని, మరింత మంది ఆదివాసీ యువతీ యువకులు చదువులలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుంజా బాలకృష్ణ, పైడా ముత్తయ్య, సున్నం కన్నయ్య, తెల్లం కృష్ణ, మోసం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి ప్రభుత్వంతో సుస్థిర అభివృద్ధి

**- ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి**

ప్రజాశక్తి-మారేడుమిల్లి

రాష్ట్రంలో సుస్థిరమైన అభివృద్ధి సాధించాలంటే జగన్మోహన్ రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ఎన్.ధనలక్ష్మి అన్నారు. మండల కేంద్రం మారేడుమిల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల వల్ల ప్రజలలో ఆర్థిక సామర్థ్యం పెరిగిందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం దఫ దఫాలుగా పింఛను సొమ్ము పెంచుకుంటూ పోతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్, ఎంపీపీ, జెడ్పిటిసి, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## 20న జనసేన డివిజన్ సమావేశం


ప్రజాశక్తి- చింతూరు

రంపచోడవరంలో ఈ నెల 20 ఉదయం 10 గంటలకు జరుగు జనసేన పార్టీ డివిజన్ స్థాయి సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని జనసేన మండల అధ్యక్షులు మడివి రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ అరకు పార్లమెంటరీ ఇన్‌ఛార్జి వంపురి గంగులయ్య, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్ పాల్గొంటారని, క్రియాశీల సభ్యత్వ కిట్ల పంపిణీ జరుగుతుందని తెలిపారు.

## టిడిపి నుంచి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-రంపచోడవరం

తెలుగుదేశం పార్టీకి చెందిన సుమారు 20 కుటుంబాలకు చెందిన వారు శుక్రవారం వైసిపిలో చేరారు. స్థానిక ఎంపీపీ కార్యాలయం వద్ద వారికి ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, జెడ్పిటిసి, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి మండల కన్వీనర్, సొసైటీ ప్రెసిడెంట్, కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ కోఆప్షన్ మెంబర్లు, సచివాలయం కన్వీనర్లు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే సమక్షంలో వైసిపిలో చేరిన టిడిపి కార్యకర్తలు

### ఉపాధి పనుల్లో..

## నాణ్యత అధారంగా బిల్లుల చెల్లింపు

ప్రజాశక్తి -పాడేరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ కింద చేసిన పనుల్లో పటిష్టమైన నాణ్యతలు పాటించాలని ఐటిడి ఏ పిఒ వి.అభిషేక్ ఆదేశించారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయం నుండి ఇంజనీరింగ్ అధికారులు, ఎంపిడిఓలు, ఉపాధి హామీ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెటీరియల్ కాంపోనెంట్ కింద చేసిన పనుల నాణ్యతలు తనిఖీ చేసి నివేదించాలని ఎంపిడి ఓలు, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో చేసిన పనుల నాణ్యతలు ఆధారంగా బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. రూ.5 లక్షల పైబడి చేసిన పనులను నాణ్యతలు పరిశీలించి నివేదిస్తే త్వరలోనే బిల్లులు చెల్లింపులకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. ఉపాధి పనులు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు కాంపోనెంట్ తీసుకుంటామని. చెప్పారు. పనులు జాప్యం చేయకుండా వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఇఇలు డివి ఆర్ఎం.రాజు, కె. వేణు గోపాల్ , ఉపాధిహామీ ఎపిడి జె. గిరిబాబు, ఎంపిడి ఓలు, ఎ ఇలు ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

## అదుపుతప్పిన ట్రాక్టర్

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోనివిద్యుత్ స్తంభాలు లోడు తీసుకువెళ్తూ ట్రాక్టర్ ప్రమాదానికి గురైంది. సంతరీ పంచాయతీ సంతారి గ్రామ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామ ప్రజలు తెలిపిన వివరాలు ప్రకారం... హుకుంపేట నుంచి విద్యుత్ స్తంభాల లోడుతో సంతారి గ్రామం బ్రిడ్జి వద్ద అదుపుతప్పి చెట్టును ఢీ కొంది. దీంతో, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.



## ఎడతెరిపిలేని వర్షం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా జోరుగా వర్షం కురిసింది. ఈ వర్షం కారణంగా శుక్రవారం అరకు వారపు సంతలో కూరగాయలు, ఇతర అటవీ ఉత్పత్తులు విక్రయించడానికి తీసుకెళ్లిన గిరిజన రైతులు పలు ఇబ్బందులు పడ్డారు. నూతనంగా నిర్మిస్తున్న 516 ఇ హైవే రోడ్డు నిర్మాణం చేపట్టని ప్రదేశంలో బురదమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం తెల్లవారుజామున అధికంగా వర్షం కురవడంతో మండల వాసులు భయాందోళనకు గురయ్యారు. మండల కేంద్రంలోని వీధి కాలువలన్ని పూర్తిగా వర్షంతో నిండాయి. కాలువల్లో చెత్తాచెదారం వర్షపు నీటితో ఉండిపోవడంతో స్థానికులు పలు ఇబ్బందులు పడ్డారు. వ్యవసాయ పంటలు సాగు చేసి గిరి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చాపరాయి జలపాతం గెడ్డ పొంగి ప్రవహించడంతో సందర్శించిన పర్యాటకులు నిరాశతో వెనుదిరిగారు.



విజేతలను సన్మానిస్తున్న కలెక్టర్

## గ్రూప్ -1 విజేతలకు సన్మానం


ప్రజాశక్తి-పాడేరు: ఐటిడిఏ - 21వ సెంచరీ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ అందించిన సివిల్స్ శిక్షణను గిరిజన అభ్యర్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. గ్రూప్ -1, ఎస్ఎస్సీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. వివిధ పోటీ పరీక్షల్లో విజేతలుగా నిలుస్తున్నారు. 12 మంది అభ్యర్థులు గ్రూప్-1 మెయిన్స్‌కు అర్హత సాధించగా, ఇంటర్వ్యూలకు ముగ్గురు అర్హత సాధించారు. ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహించిన ఇంటర్వ్యూలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గిరి పుత్రికలలో ఇద్దరు గ్రూప్ 1 ఉద్యోగాలు సాధించారు. ఐటిడిఏ 21వ సాఫ్టవేర్ సొల్యూషన్స్ సంయుక్తంగా అందించిన సివిల్స్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ర్యాంకులు సాధించిన చిట్టపులి జీవన, జౌడు వెంకట సత్యకీర్తి ఎపిపిఎస్సి విడుదల చేసిన ఫలితాల్లో గ్రూప్-1 ఉద్యోగాలు సాధించి విజేతలుగా నిలిచారు. చిట్టపులి జీవన, వెంకట సత్తకీర్తిలను శుక్రవారం ఐటిడి ఏ కార్యాలయంలో జిల్లా కల్టెర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, ఐటిడి ఏ.పి.ఓవి. అభిషేక్ ఘనంగా సన్మానించారు. 21వ సెంచరీ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ అధినేత ధరణి అభినందనలు తెలియ జేసారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, ఎబెడబ్ల్యూఓ ఎల్.రజని, అభ్యర్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి హుకుంపేట:సచివాలయంలో నెట్ సేవలు అందుబాటులో లేక ప్రజలు ఇక్కట్లు పడ్డారు. బూర్జ పంచాయతీ మజ్జివలసలో సిగ్నల్స్ లేక పోవడంతో రేషన్ కార్డుల ఎడిట్ కోసం పట్టాం సచివాలయంకు రావాలని సిబ్బంది చెప్పడంతో గిరిజనులు శుక్రవారం వచ్చారు. తీరా ఇక్కడకు వచ్చిన గిరిజనులకు తీవ్ర నిరాశ ఎదురైంది. పట్టాం సచివాలయంకు సంబంధించి కోడ్ ప్రకారంగా రేషన్ కార్డుల ఎటిడింగ్ అవుతుందని సిబ్బంది చెప్పడంతో బాధిత గ్రామస్తులు కే.బాలరాజు, కే రాజు, సాయి సూర్యం, ఎం.గోవింద, ఎం.సుబ్బయ్య, ఎన్.తేజ, ఎం.రాజు, రాములమ్మ తదితరులు వెనుతిరిగారు.

## అనారోగ్యంతో అంగన్వాడీ టీచర్ మృతి

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని కొట్నాపల్లి పంచాయతీ మారేల గ్రామం ఉప్ప పీహెచ్ డాక్టర్ పొట్టంగి ప్రశాంత్ కుమార్ తల్లి పొట్టంగి అంగన్వాడీ టీచర్ బుల్లమ్మ (53) అనారోగ్యంతో బాధపడుతూ మృతి శుక్రవారం చెందింది. మృతి చెందిన అంగన్వాడీ టీచరు కుటుంబ సభ్యులను తెలుగుదేశం పార్టీ ఎస్ టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్ను దొర, మాజీ ఎమ్మెల్యే లకే రాజరావు, రాపా మాజీ సర్పంచ్ బొంజోబాబు, అరకు అసెంబ్లీ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి శంకర్ నాయడు, రంగాశీల ఉప సర్పంచ్ దాసు బాబురావు, నాగరాజు పరామర్శించారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు, బంధువులు

# మిర్చి, పొగాకు సాగుకు సన్నద్ధం

### నారుమడుల తయారీలో రైతుల నిమగ్నం



మిర్చి నారు మడిలో పని చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-విఆర్.పురం

వాణిజ్య పంట మిర్చి, పొగాకు సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. నారుమడుల తయారీలో రైతులు నిమగ్నమై ఉన్నారు. ఇటీవల వర్షం కురిసి తెరిపివ్వడంతో మిర్చి, పొగాకు విత్తనాలు చల్లి నారుమడులను సిద్ధం చేశారు. వేసిన నారును కంటికిరెప్పలా కాపాడుకుంటున్నారు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి సాగుచేస్తున్న మిర్చి, పొగాకు పంటలపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఈ ఏడాదైనా తోటలు తెగుళ్ల బారిన పడకుంటే మంచి దిగుబడులు వచ్చి అప్పుల గట్టెక్కుతామనే నమ్మకంతో ఉన్నారు.

విలీన మండలాల్లో ప్రతి ఏడాది సుమారు 15వేల ఎకరాల్లో మిర్చి, పొగాకు పంటలు పండిస్తున్నారు. వాతావరణ పరిస్థితులు, గోదావరి వరదలతో మినుము, పెసర, వరి పంటల సాగు దిగుబడి రాకపోవడంతో ఎక్కువ మంది రైతులు మిర్చి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో ఎకరా మిర్చి సాగుకు రూ.1.50 లక్షల పైగా పెట్టుబడి పెడుతున్నారు. పొగాకు పంట కూడా విలీన మండలాల్లో సాగు చేస్తున్నారు. దీనికి కూడా ఎకరాకు రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంది.

**మిర్చి నారు తయారీ ఇలా..**

గోదావరి వరద ముంపు గురికానీ ప్రాంతాల్లో జులై నెలలోనే ప్రత్యేకమైన దుక్కులు చేసి పశువుల పెంట, ఎరువులు కలిపి మడులుగా తయారు చేసుకున్నారు. వివిధ రకాల మిర్చి విత్తనాలు కిలో సుమారు రూ.1లక్షకు కొనుగోలు చేసి, వాటిని మడుల్లో విత్తారు. విత్తనాలు వేసిన నారు మడులపై పాల చెట్టు ఆకులను, కొందరు వారి ఆర్థిక స్థోమతను బట్టి నారుమడులకు నెట్ కప్పితారు. విత్తనాలు మొలకెత్తిన తరువాత మడులపై కప్పిన ఆకులను తొలగిస్తారు. అప్పటి నుంచి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సుమారు 45 రోజుల పాటు నారును కంటికి రెప్పలా కాపాడుకుంటారు. గంట గంటకు మడులను నీటితో తడుపుతూ చీడపీడలు సోకకుండా పురుగు మందులు పిచికారీ చేస్తారు. విత్తనాలు వేసిన 45 రోజులకు నారుమడుల నుండి మొక్కలను తీసి నాటుతారు.

**మిర్చిపైనే ఆశలు**

గత నెలలో గోదావరి వరదలు వచ్చి పోవడంతో ప్రస్తుతం పొలాలన్నీ ఆరుదలనిచ్చాయి. దీంతో ట్రాక్టర్లతో ముమ్మరంగా దుక్కులు చేసుకుంటున్నారు. వాతావరణం అనుకూలిస్తే మరో వారం రోజుల్లో పొలాల్లో మొక్కలు నాటుకునేందుకు సిద్ధమవుతున్నారు. మిర్చి సాగుపై విలీన మండలాల రైతులు ఆశలు పెట్టుకుని వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. గోదావరి వరదల ఆగస్టు గండం గట్టెక్కితే సాగు కలిసి వస్తుందని రైతులు చెబున్నారు. గతేడాది క్వింటా మిర్చి రూ.24వేలు వరకు అమ్ముడైంది. ఈఏడాది కూడా మిర్చికి మంచి గిట్టుబాటు ధర ఉంటే అప్పుల ఊబి నుంచి బయట పడతామని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# సచివాలయాల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

### డివైఎఫ్ఐ జిల్లా నేతలు శివాజీ, రాజు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల్లో వివిధ కేటగిరీలకు చెందిన ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డివైఎఫ్ఐ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు సిహెచ్.శివాజీ, ఉపాధ్యక్షులు అల్లు రాజు డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ 2020 నుంచి సచివాలయాల్లో పోస్టులు భర్తీ చేయకపోవడంతో జిల్లాలో 522 గ్రామ, వార్డు సచివాలయాల్లో 800 పోస్టులు ఖాళీగా వున్నాయని పేర్కొన్నారు. దీంతో ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులపై పనిభారం పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిచ్చిన సచివాలయాల్లో ఖాళీలను భర్తీ చేయకపోవడం విచారకరమన్నారు. గ్రూపు-1, గ్రూపు-2, డిఎస్సీ, ఇతర ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగులు సచివాలయ ఉద్యోగాల కోసం ఆశతో ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం సచివాలయాల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి నియామకాలకు తగిన ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జాప్యం చేస్తే నిరుద్యోగులను సమీకరించి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు పి.చలపతి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డివైఎఫ్ఐ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు శివాజీ

## స్పందన సమస్యలపై ప్రత్యేక దృష్టి

### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జగనన్నకు చెబుదాం, స్పందన సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ తో కలిసి శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 135 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ, ఫిర్యాదులను 24 గంటల్లో పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. స్పందన ఫిర్యాదులపై సంబంధిత శాఖాధికారులకు పదేపదే గుర్తు చేస్తున్నామన్నారు. పెదబయలు మండలం పెదకోడాపల్లి పంచాయతీ తుంబరిగి గ్రామ రైతులు చెక్ డ్యాం మంజూరు చేసి సాగు నీరందించాలని గ్రామస్తులు ఎం. సుబ్బారావు, కె. సుందర రావు వినతి పత్రం సమర్పించారు. జి.కె. వీధి మండలం దేవరాపల్లి పంచాయతీ మంగళపాలెం గ్రామానికి చెందిన దరఖాస్తు చేశారు. మ్రి జిమ్మి ఇల్లు మంజూరు చేయాలని హుకుంపేట మండలం బీకుమద్దుల పంచాయతీ ఉప సర్పంచ్ ఎం.ఉత్తరన్న, ఎం.సుబ్బారావు తదితరులు బీకుమద్దుల నుండి దల్ల పల్లి వరకు తారు రోడ్డు నిర్మించాలని కోరారు. పాడేరు మండలం ఎగమోదాపుట్టు గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించాలని కె.లచ్చన్న వినతిపత్రం సమర్పించారు. జి. మాడుగుల మండలం సొలభం పంచాయతీ గడుతూరు నుండి ఎస్.కొత్తూరు వరకు గల రోడ్డు ఐటీఏ వర్షాలకు పాడై పోయిందని రోడ్డు రెండు కల్వర్టులు నిర్మించాలని కిల్లో సుబ్బారావు, కిల్లో జగ్గారావు వినతి పత్రం సమర్పించారు. పాడేరు మండలం వంజంగి పంచాయతీ సంపాలు గ్రామానికి సిసి రోడ్డు మంజూరు చేయాలని సర్పంచ్ వి.బొంజుబాబు, పెదబయలు మండలం పెదకోడాపల్లి పంచాయతీ దూరుపల్లి గ్రామానికి చెందిన బద్నాయిని వరహ తేజ పింఛను మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ పి. అంబేద్కర్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్.రజని, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇఇ లీలా కృష్ణ, పంచాయతీ రాజ్ ఇఇ. టి.కొండయ్య పడాల్, పీఐయు ఇఇ కె.లావణ్య కుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్. నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్ రావు, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## బడిబాట స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బడి మానేసిన విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు డ్రాప్ అవుట్ డ్రైవ్ మండల కేంద్రంలో పది రోజులు నిర్వహిస్తామని ఎంపీడీవో రమేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు.

## మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

ప్రజాశక్తి -గాజువాక : మొక్కలు నాటడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అన్నారు. ఇంటి పరిసరాలతో పాటు ఆలయాలు, మసీదులు, చర్చిల ప్రాంగణాల్లో వివిధ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. శుక్రవారం వార్డులోని అశోక్ నగర్ రోడ్డు నంబర్-7లో నూకాంబిక అమ్మవారి ఆలయం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్పొరేటర్ నరసింహ పాత్రుడు,అమరావ దంపతులు మొక్కలు నాటారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బసా వెంకటస్వామి రెడ్డి, ఎంపివిపి ఆచారి, రుక్కల శ్రీనివాస్ ,రెడ్డిపల్లి ఆనందకుమార్, కృష్ణమూర్తి, నాగరాజు, కామేష్, వీరబాబు, చంటి, ఎస్ శ్రీను, గగనం కాశీ విశ్వేశ్వరరావు, శంకర రెడ్డి, ఆర్మీ సతీశ్ పాల్గొన్నారు.

## శ్రామిక మహిళలపై వేధింపులు అరికట్టాలి

### సిఐటియు డిమాండ్



మాట్లాడుతున్న అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-పాడేరు: శ్రామిక మహిళలు పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారని, తక్షణం 2013 లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పాడేరులో శ్రామిక మహిళ జిల్లా సదస్సు అంగన్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు పని ప్రదేశాల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చెప్పుకోలేని సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. పని ప్రదేశాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శ్రామిక మహిళలు హింసకి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ వామపక్షాలు తప్ప ఇతర ఏ పార్టీలు మద్దతు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. తెల్లవారితే మహిళల కోసమే పని చేస్తున్నట్లు ఓట్లు దండుకునే పాలక పార్టీలకు వారి సమస్యలు పట్టవా అని ప్రశ్నించారు. శ్రామిక మహిళలకు సిఐటియు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కె భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న స్కీం వర్కర్లందరూ ఐక్యంగా ఉండాలని తెలిపారు. పని ప్రదేశాల్లో వాష్ రూమ్ లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహిళ కేసులు పరిష్కారం కై జిల్లాలో మహిళా కోర్టు ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ హైమా, అంగన్వాడీ జిల్లా నాయకులు, వెంకటలక్ష్మి, వివోఏ జిల్లా అధ్యక్షులు భాను, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు వై.మంగమ్మ, మిడ్ డే మీల్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు లక్ష్మి, శ్రామిక మహిళలు పాల్గొన్నారు.

## అన్నదాతల కష్టాన్ని గుర్తించాలి



మాట్లాడుతున్న కిశోర్‌కుమార్

ప్రజాశక్తి-సీతమ్మధార: ప్రపంచంలోని ప్రజలకు ఆహారాన్ని అందిస్తున్న అన్నదాత శ్రమను, విలువను గుర్తించి, వారిని గౌరవించాలని మిషన్ కర్షక దేవోభవ చైర్మన్ ఆచార్య కిషోర్ కుమార్ కోరారు. మిషన్ కర్షక దేవోభవ ప్రచార కార్యక్రమంలో భాగంగా 21వ రోజు శుక్రవారం విశాఖ నగరంలో ఎలియోన్ టెక్నాలజీస్ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఆహారాన్ని వృధా చేయకుండా వాటిని పండించి ఇస్తున్న రైతులకు ధన్యవాదాలు తెలపాలన్నారు. కూరగాయలు, ఇతర పంటలు కొనే సమయంలో బేరసారాలు ఆడొద్దని హితవు పలికారు. ఆర్‌టిసి బస్సుల్లో రైతులకు ప్రత్యేక సీటు కేటాయించాలన్నారు. రైతుల కష్టం, వారి సంక్షేమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మిషన్ కర్షకదేవోభవ ప్రాజెక్టు ద్వారా ప్రజల్లో ప్రచారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సర్వేపై సమావేశం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఓటర్ల జాబితా సమగ్ర సర్వేలో వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆర్‌డిఒ, ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్.భాస్కరరెడ్డి సూచించారు. శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఇప్పటివరకు ఓటర్ల జాబితా పరిశీలనలో భాగంగా బిఎల్‌ఒలు ఇంటింటా చేపట్టిన సర్వే వివరాలను వెల్లడించారు. ఓటర్ల జాబితా సర్వేలో బాగా వెనుకబడిన ప్రాంతాలపై దృష్టి పెట్టాల్సి ఉందని, దీనికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. అవసరమైన చోట అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుకు సుముఖంగా ఉన్నట్లు వెల్లడించారు. తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, ఎన్నికల డిటి జె భాస్కరరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు అల్లిపిల్లి నరసింగరావు (వైసిపి), గంటా నూకరాజు, కొక్కొరి అప్పన్న (టిడిపి), కె రామానాయుడు (బిజెపి), కె రాంబాబు (సిపిఐ) కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి- సీతమ్మధార: రాగమాలిక సాంస్కృతిక సంస్థ 157వ మాసపు గీతమాలిక, 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. కళారంగ ప్రముఖులు సన్ మూర్తి, భయ్యా శ్రీనివాస్, వెంకటేష్ పల్లా, కెవి.సత్యనారాయణ, మహమ్మద్ ఖాన్, ఇందిరా సాహిని తదితరులు జ్యోతి ప్రజ్వలనతో సంగీత విభావరిని ప్రారంభించారు. రాగమాలిక బృందం సభ్యులు మీనా కుమారి, ఆదిలక్ష్మి, ఇందిరా సాహిని, శైలజ, శ్వేత, సుబ్బారావు, పార్థసారథి, భరద్వాజ్, రాజు, చింతపల్లి సత్యనారాయణ, ఆనందరావు శ్రీకాంత్, బొమ్మిడి సత్యనారాయణ తదితరులు అలనాటి మేటి సినీ గీతాలు ఆలపించారు. ఇటీవల పరమపదించిన ప్రజాగాయకులు గద్దర్‌కు 'బండి ఎనక బండి కట్టి' అనే పాటతో ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో చింత ప్రభాకర్,వెంకటేష్, గడ్డం ప్రసాద్ పాల్గొని, కళాకారులను అభినందించారు.

## టాటా మోటార్స్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని వేములవలస, భీమిలి క్రాస్ రోడ్ వద్ద జెఎస్‌పి ఇండస్ట్రియల్ ప్రైవేట్ లిమిటెడ్ నూతనంగా టాటా మోటార్స్ సర్వీసింగ్ సెంటర్‌ను ప్రారంభించారు విజయనగరం విశాఖపట్నం చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో సర్వీస్ కొరకు నూతన టెక్నాలజీతో కస్టమర్లకు సేవలు అందిస్తున్నామని డైరెక్టర్ సత్యనారాయణ తెలిపారు. నాలుగు నెలల క్రితం విశాఖలో ఒక బ్రాంచ్‌ను ప్రారంభించామని, ఇపుడు వేములవలసలో మరో బ్రాంచిని ప్రారంభిస్తున్నట్లు సత్యనారాయణ తెలిపారు. దీన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టాటా మోటార్స్ సిఎక్స్ఎం దారకేష్, విశాఖపట్నం సేల్స్ జిఎం సాయి, సర్వీస్ జిఎం పఠాన్, జ్యోతి సుధాన్, పంతం గురవయ్య ,పి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### 11,12 తేదీల్లో

## విశాఖలో జైళ్ల శాఖ జాతీయ సదస్సు

ప్రజాశక్తి - ఆరిలోవ :వచ్చేనెల 11, 12 తేదీల్లో విశాఖ నగరంలో జైళ్ల శాఖ జాతీయ సదస్సు, వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు ఆ శాఖ ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం విశాఖ సెంట్రల్ జైల్‌లో విలేకర్లతో మాట్లాడుతూ, ఆజాదీ కా అమృతోత్సవ్‌లో భాగంగా రాష్ట్ర జైళ్ళ శాఖ, బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలెప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించనున్న జాతీయసదస్సుకు వివిధ రాష్ట్రాల జైళ్ల శాఖ ఐజిలు, డిజిలు సుమారు 100 మంది పాల్గొంటారన్నారు.. 2019లో విశాఖ నగరంలో మొదటి సదస్సు నిర్వహించారని, ఇపుడు రెండవ సదస్సు విశాఖ నగరంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సదస్సులో జైళ్లశాఖకు సంబందించిన ఆరు ముఖ్యమైన విషయాలపైనా, వివిధ రాష్ట్రాల జైళ్ల శాఖలో విజయవంతంగా జరుగుతున్న అభివృద్ధి పనులు, టెక్నాలజీ ఇన్ కరక్షనల్ అడ్మినిస్ట్రేషన్, స్టేటస్ ఆఫ్ మెంటల్ హెల్త్ ఇన్ ప్రిజన్స్, ఖైదీల సంక్షేమం తదితర విషయాలపై చర్చిస్తారని తెలిపారు. ఈ సదస్సుకు నోడల్ అధికారిగా ఎస్.రాహుల్ వ్యవహరిస్తారన్నారు.

## ఉపాధ్యాయ సమస్యలపై నేడు ఫ్యాప్టో నిరసన

ప్రజాశక్తి - ఆరిలోవ: విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యలపై శనివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. శుక్రవారం డిఇఒ కార్యాలయం వద్ద విలేకర్లతో మాట్లాడుతూ, బదిలీలు, ప్రమోషన్లు పొందిన ఉపాధ్యాయులకు రెండు నెలల వేతన బకాయి చెల్లించాలని, పాఠశాల విద్యారంగాన్ని అతలాకుతలం చేస్తున్న జిఒ117ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఈ నిరసన చేపడుతున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఫ్యాప్టో నాయకులు సిహెచ్.వెంకటేశ్వర్లు, దాసరి నాగేశ్వరరావు, కొటాన శ్రీను, పైలా దేముడుబాబు, ఎ.ధర్మేంద్రరెడ్డి, ప్రకాష్ బాబు, టి.రామకృష్ణారావు పాల్గొన్నారు.

## బాలల నేర నియంత్రణపై వర్క్‌షాప్

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ :హైకోర్టు జువైనల్ జస్టిస్ కమిటీ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యం బాలల నేరాలపై అవగాహన, నియంత్రణకు న్యాయసేవాధికార సంస్థలో జిల్లాస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. పిల్లల నేరాల నివారణ, నిర్బంధానికి ప్రత్యామ్నాయాలు, కస్టడీయేతర ప్రత్యామ్నాయాలు, పునరావాసం, పునరుద్ధరణ పద్ధతులు, న్యాయపరమైన విచారణ, పిల్లల స్నేహపూర్వక విధానాలకు హక్కు, నేర బాధ్యతకు కనీస వయస్సు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.

కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు మాట్లాడుతూ, జువెనైల్ జస్టిస్ యాక్ట్, రూల్స్, పిల్లలకు సంబంధించిన, ఇంకా ఇతర కేసులలో ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్, అండర్ సెక్షన్ 65బి సాక్ష్యచట్టం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎస్. శ్రీదేవి, రెండవ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కెవిఎల్ హిమబిందు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవి.శేషమ్మ, డిప్యూర్ కలెక్టర్ ఎంఎస్. కళావతి, అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎంఆర్ కె రాజు, ఎఎస్‌పి బి.విజయ్ భాస్కర్, డిఇఒ చంద్రకళ, ఐసిడిఎస్ పీడీ బి.వెంకటేశ్వరి పాల్గొన్నారు.

## ధ్వజస్తంభానికి బంగారు తాపడం

### - రూ.1.80 కోట్లతో సింహాచలంలో పనులు ప్రారంభం

ప్రజాశక్తి సింహాచలం: సింహాచల దేవస్థానంలో ధ్వజస్తంభానికి స్వర్ణతాపడం పనులను ఇఒ వి త్రినాధరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రూ.1.80కోట్లతో ధ్వజస్తంభంపై ప్రస్తుతం ఉన్న రాగి రేకుపై బంగారు రేకు తాపడం చేయనున్నారు దీనికోసం ఒక కిలో 600 గ్రాముల బంగారం అవసరం కాగా, ప్రముఖ బంగారు వస్త్ర వ్యాపారవేత్త, సిఎంఆర్ అధినేత మావూరి విరాళంగా సమర్పించారు. చెన్నైకి చెందిన స్మార్ట్ క్రియేషన్స్ సంస్థ ధ్వజస్తంభ తాపడం పనులు చేపడుతోంది. దేవాలయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత, ఆలయ పర్యవేక్షకులు భ్రమరాంబ, ఇఇ శ్రీనివాసరాజు, రాంబాబు ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు 48 అడుగుల ఎత్తున్న ధ్వజస్తంభంపై ప్రస్తుతమున్న రాగి రేకును కూలీలతో తొలగించారు నెల రోజుల్లో బంగారు తాపడం పనులు పూర్తిచేస్తామని కాంట్రాక్టర్ రామచంద్రారెడ్డి తెలిపారు.



ఫొటో ఎగ్జిబిషన్ వివరాలు వెల్లడిస్తున్న సొసైటీ ప్రతినిధులు

## నేటి నుంచి ఫొటో ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేర్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ, వైజాగ్ స్టీల్ ప్లాంట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫొటో ఎగ్జిబిషన్ ఈ నెల 19 ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని, స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్‌భట్ ముఖ్య అతిథిగా హాజరవుతారని వాల్తేర్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ కార్యదర్శి ఎంవి.శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం పెదవాల్తేరులోని అసగానంద ఆశ్రమంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్తేర్ ఫోటోగ్రాఫిక్ సొసైటీ ఆవిర్భవించి 23 సంవత్సరాలు పూర్తయిందని, నాటి నుంచి ఎన్నో కార్యక్రమాలూ చేపడుతూ వస్తోందని తెలిపారు. ఈ నెల 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రెండు రోజులుపాటు స్టీల్ హౌస్ సమావేశ మందిరంలో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. పిల్ల రాజారావు (వాసు) పేరున జీవిత సాఫల్య పురస్కారాన్ని సీనియర్ ఫొటో జర్నలిస్టు సివి.సుబ్రమణ్యంకు, బండి వేంకటంమణ పేరున జీవిత సాఫల్య పురస్కారాన్ని సీనియర్ ఫొటోగ్రాఫర్ ప్రసాద్‌కు ఇవ్వనున్నామన్నారు. సమావేశంలో అధ్యక్షుడు పిఎన్.సేత్, గౌరవ అధ్యక్షులు వి.వేంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## గ్లోబల్ మారిటైం ఇండియా సమ్మిట్‌కు సన్నాహాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : కేంద్ర పోర్టులు, నౌకాయాన, జలరవాణా మంత్రిత్వ శాఖ, ఫిక్కి సంయుక్తంగా గ్లోబల్ మారిటైం ఇండియా సమ్మిట్ - 2023 థర్డ్ ఎడిషన్‌ను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. అక్టోబర్ 17, 18, 19 తేదీల్లో ఢిల్లీలో భారీ ఎత్తున ఈ సమ్మిట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అంతర్జాతీయ, రీజనల్ భాగస్వామ్యాలను ఏర్పాటు చేయడం ద్వారా భారత నౌకాయాన వాణిజ్యాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడమే ఈ సమ్మిట్ ముఖ్యఉద్దేశం. భారత, అంతర్జాతీయ నౌకాయాన వ్యాపారులకు ఆ రంగంలో ఉన్న ఇబ్బందులు గురించి చర్చించడం, నూతన అవకాశాలను అవిష్కరించడం, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకట్టుకోవడం వంటి అంశాలను చర్చించేందుకు ఇది ఓ వేదిక కానుంది. గ్లోబల్ మారిటైం ఇండియా సమ్మిట్ 2023కు సన్నాహకంగా విశాఖపట్నం పోర్టు అథారిటీ ఈ నెల 23న విశాఖపట్నంలోని నోవాటెల్ వద్ద రోడ్ షో నిర్వహించనుంది. అందులో షిప్పింగ్ ఏజెంట్లు, వ్యాపారులు, పోర్టు భాగస్వాములు, పిపిపి ఆపరేటర్లు, మారిటైం బోర్డు సభ్యులు, పాల్గొంటారు. రోడ్ షోలో భాగంగా మారిటైం సెక్టార్‌లో ఉన్న విస్తారమైన అవకాశాలను వారు చర్చించనున్నారు. ఆనంతరం అక్టోబర్‌లో ఢిల్లీలో మూడు రోజుల పాటు జరగనున్న సమ్మిట్‌లో విశాఖపట్నం పోర్టు ఆధ్వర్యంలో వారంతా పాల్గొననున్నారు. ఢిల్లీలో జరిగే సమ్మిట్‌ను ప్రధాని మోడీ లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో మారిటైం రంగంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పరిశ్రమల నిర్వాహకులు, నిపుణులు పాల్గొంటారు. ఈ సమ్మిట్‌లో విశాఖపట్నం పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనులు, భావిష్యత్తు ప్రణాళికలు, పోర్టు ప్రత్యేకతలు, పెట్టుబడుల అవకాశాలు, వ్యాపార అవకాశాలు వంటి అంశాలను వివరించేలా విశాఖపట్నం పోర్టు స్టాల్‌ను ఏర్పాటు చేయనుంది.

## 200 మొబైల్ ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగర సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల కాలంలో చోరీకి గురైన 200 మొబైల్ ఫోన్లను సిసిఎస్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారని నగర పోలీస్ కమిషనర్ సిఎం త్రివిక్రమ్ వర్మ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాట్-బాట్ వెబ్ పోర్టల్ ఈ ఫోన్లను కనుగొనడంలో ఎంతో సాయపడిందని తెలిపారు. గడిచిన మూడు నెలల కాలంలో సుమారు రూ.40 లక్షలు విలువచేసే 200 మొబైల్ ఫోన్లను కనుగొన్నామని చెప్పారు. స్వాధీనం చేసుకున్న వాటిని బాధితులకు అందజేస్తామన్నారు.

## యాప్‌ల ఒత్తిడి తగ్గించండి మహాప్రభో..!

### ఆందోళనకు దిగిన సచివాలయ హెల్త్ సెక్రటరీలు



మహాధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మణి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తమపై వివిధ రకాల యాప్‌ల పేరుతో పెరిగిన పని ఒత్తిడిని తగ్గించాలంటూ గ్రామ వార్డు సచివాలయం హెల్త్ సెక్రెటరీలు శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహా ధర్నా నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూలల నుంచీ పెద్ద సంఖ్యలో వారు తరలివచ్చారు. వారినుద్దేశించి యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు సిహెచ్.సత్యనారాయణ మాట్లాడారు. ఇతర శాఖల్లో లేని విధంగా వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ సెక్రెటరీలు 47 రకాల యాప్‌లు, వాటికి సంబంధించి మరో 70 రకాల ఉప యాప్‌లు ఉపయోగిస్తున్నారని, వీటన్నింటితో పని చేయడం వల్ల వారు మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఈ యాప్‌లపై పని చేయడం వల్ల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. సిబ్బంది మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో ప్రతి ఆరోగ్య కేంద్రంలోనూ ఈ యాప్‌లు, ఇతర సాంకేతిక పనులు చేయడానికి డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించాలని, హెల్త్ సెక్రెటరీలను కేవలం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూహెల్త్ సెక్రెటరీలందరికీ ఎంపిహెచ్ఎ (ఎఫ్)లుగా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో మాత్రమే హెల్త్ సెక్రెటరీలు పనిచేసేలా చూడాలని కోరారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కె.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ హెల్త్ సెక్రెటరీలను పంచాయితీరాజ్, జివిఎంసి విభాగాల్లోనూ వివిధ పనులకు ఉపయోగిస్తున్నారని తెలిపారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2500 జనాభాకు ఒక హెల్త్ సెక్రెటరీ ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాము, కృష్ణ మోహన్, చిట్టిబాబు, గ్రామ వార్డు సచివాలయాల హెల్త్ సెక్రెటరీల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు దేవకి, రత్నం, పరమేశ్వరి, నిర్మల పాల్గొన్నారు. మహాధర్నాకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, టిఎన్‌టియుసి నాయకులు శ్రీనివాసాచారి, ఎఎన్ఎంహెచ్‌వి యూనియన్ నాయకురాలు వెంకటలక్ష్మి తదితరులు మద్దతు తెలిపారు.

### అగనంపూడి టోల్‌గేట్ సమస్యపై

## 21న సిపిఎం భారీ ధర్నా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తక్షణం అగనంపూడి టోల్‌గేట్‌ను తొలగించాలని కేంద్ర బిజెపి, రాష్ట్ర వైసిపి ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ ఈ నెల 21వ తేదీ ఉదయం 6.30 గంటల నుంచి సిపిఎం ఆధ్వర్యాన ఆ టోల్ గేట్ వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్టు ఆ పార్టీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తెలిపారు. శుక్రవారం ఉదయం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా చట్టవిరుద్ధంగా అగనంపూడి టోల్‌గేట్ కొనసాగుతోందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో టోల్ గేట్లు ఉండకూడదనే నిబంధనలను కూడా ధిక్కరిస్తూ వస్తోందన్నారు. 1998 నుంచి అగనంపూడి వద్ద టోల్ గేట్ పెట్టి ఫీజులు వసూలు చేయడం ప్రారంభించారని తెలిపారు. అనకాపల్లి నుంచి ఆనందపురం వరకు నాలుగు వరుసల రోడ్డు వేసినందుకు టోల్ గేట్ ఏర్పాటు చేసినట్లు ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించిందని పేర్కొన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు నుంచి రూ.63 కోట్లు అప్పు తీసుకొచ్చి 40 కిలోమీటర్ల పొడవు రోడ్డు వేసి డబ్ల్యుబి సంస్కరణల్లో భాగంగా టోల్ ఫీజును అమలు చేస్తోందన్నారు. నాటి నుంచి నేషనల్ హైవే అథారిటీ టోల్ గేట్ నిర్వహిస్తూ ఫీజులు వసూలు చేస్తోందన్నారు. ప్రభుత్వం పెట్టిన ఖర్చు మొదటి ఐదేళ్లలోనే వచ్చేసిందని, అయినా డబ్బును రుచిమరిగిన ప్రభుత్వాలు అక్రమంగా దీనిని కొనసాగిస్తూ వస్తున్నాయన్నారు. ఇప్పటి వరకూ టోల్‌గేటు తొలగింపునకు జరిగిన ఆందోళనలు, కోర్టు కేసుల వివరాలను గంగారావు వెల్లడించారు. ఆఖరికి గాజువాక బార్ అసోసియేషన్ హైకోర్టులో పబ్లిక్ ఇంటరెలిటిగేషన్ (పిల్) కేసు 2017లో వేసిందని, 2019 జనవరి 29న టోల్‌గేట్‌ను తొలగించాలని తీర్పు వచ్చిందని గుర్తుచేశారు. ఫలితంగా నాలుగు నెలలు టోల్ గేట్ ఫీజు వసూలు చేయలేదన్నారు. ఈలోపు కేంద్ర బిజెపి ప్రభుత్వం కుట్రతో హైకోర్టు తీర్పుపై స్టే వేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని నేషనల్ హైవే అథారిటీ సుప్రీంకోర్టులో కేసు వేస్తుందని తెలిసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం దానిని అడ్డుకోవడానికి ఎలాంటి ప్రయత్నమూ చేయలేదన్నారు. ఫలితంగా హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో స్టే తెచ్చుకొని కేంద్ర ప్రభుత్వం టోల్ గేట్‌ను నడుపుతోందని తెలిపారు. ఆనందపురం - సబ్బవరం - అనకాపల్లి వైపు ఆరు వరుసల జాతీయ రహదారి - 16 నిర్మాణం పూర్తయిన వెంటనే టోలిగేట్‌ను తొలగిస్తామని సుప్రీంకోర్టులో నేషనల్ హైవే అథారిటీ హామీ ఇచ్చిందని, గతేడాది నుంచి ఆనందపురం వద్ద చుక్కవానిపాలెం, అనకాపల్లి దగ్గర మర్రిపాలెం వద్ద రెండు టోల్ గేట్లు ప్రారంభమయ్యాయని, అయినప్పటికీ అగనంపూడి టోల్ గేటును మాత్రం తొలగించకుండా బిజెపి ప్రభుత్వం దారిదోపిడీ చేస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో టోల్‌గేట్ తొలగింపు విషయమై ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నామని, మహాధర్నాను జయప్రదం చేయాలని ప్రజలను గంగారావు కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావు పాల్గొన్నారు.




క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవంలో నాగార్జున రెడ్డి

## ఎపిఇఆర్‌సి క్యాంపు కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) క్యాంపు కార్యాలయాన్ని విశాఖపట్నంలోని ఎపిఇపిడిసిఎల్ ప్రధాన కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎపిఇఆర్‌సి ఛైర్మన్ జస్టిస్ సివి.నాగార్జునరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎపిఇఆర్‌సి సభ్యులు ఠాకూర్ రామ్ సింగ్, పి.వెంకట్రామరెడ్డి, ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృధ్వీతేజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో ఉండేందుకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. ఇకపై కమిషన్‌కు సంబంధించిన విచారణలతో పాటు వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకొనేందుకు అవసరమైన సమావేశాలు కూడా ఈ క్యాంపు కార్యాలయంలో నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఎపి ట్రాన్స్‌కో, ఎపి డిస్కమ్స్ సమర్పించిన రిసోర్స్, ఇన్వెస్ట్మెంట్ ప్లాన్‌కు సంబంధించిన 5వ, 6వ కంట్రోల్ పీరియడ్‌పై ఎపిఇఆర్‌సి శనివారం ఉదయం ఈ క్యాంపు కార్యాలయంలోనే విచారణ కార్యక్రమాన్ని నిర్వహించనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇపిడిసిఎల్ డైరెక్టర్లు డి.చంద్రం, బి.రమేష్ ప్రసాద్, ఎవివి.సూర్యప్రతాప్, సిజిఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్ బి.సత్యనారాయణ, సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ప్రసన్నకుమార్, సిజిఎంలు వి.విజయలలిత, డి.సుమన్ కల్యాణి, అచ్చి రవికుమార్ పాల్గొన్నారు.

## పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా ఈ నెల 21 నుండి 22 వరకు 17267 కాకినాడ-విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్, 17268 విశాఖపట్నం-కాకినాడ ప్యాసింజర్ ప్రత్యేక రైలు, 07466 రాజమండ్రి-విశాఖపట్నం ప్యాసింజర్, 07467 విశాఖపట్నం-రాజమండ్రి ప్యాసింజర్ స్పెషల్ రైళ్లను రద్దు చేశారు. మరోవైపు 22643 ఎర్నాకులం-పాట్నా ఎక్స్‌ప్రెస్‌ను 21, 22 తేదీల్లోనూ, 12509 ఎస్‌విఎం బెంగళూరు - గౌహతి ఎక్స్‌ప్రెస్‌లను 23, 24, 25 తేదీల్లోనూ, 12515 కోయంబత్తూరు-సిల్చార్ ఎక్స్‌ప్రెస్‌ను 27న దారి మళ్లించారు. ఇవి సాధారణ రూట్ నిడదవోలు-ఏలూరు-విజయవాడ మార్గంలో కాకుండా మళ్లించిన మార్గం నిడదవోలు-భీమవరం టౌన్-గుడివాడ-విజయవాడ మీదుగా నడుస్తాయని రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు.

## స్ఫూర్తిదాయకమైన వీడియో 'జయ హే'

ప్రజాశక్తి - కలెక్టరేట్ : భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాలు, పెట్రోలియం,సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి వివిధ క్రీడా విభాగాలలో భారతదేశానికి కీర్తిని తెచ్చిపెట్టిన క్రీడాకారులతో కూడిన భారత జాతీయ గీతం 'జయ హే'ను విడుదల చేశారని, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ దీనికి మద్దతుగా నిలిచిందని ఇండియన్ ఆయిల్ ఛైర్మన్ శ్రీకాంత్ మాధవ్ వైద్య తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ నేషన్ ఫస్ట్ అండ్ ఫస్ట్ ఆల్వేస్ అనే సూత్రాన్ని ప్రతిఒక్కరూ ప్రతిరోజూ ఆచరించే యుగంలోకి మన దేశం ప్రవేశించడాన్ని సూచించే సృజనాత్మక వ్యక్తీకరణగా జయ హే పేరుతో స్ఫూర్తిదాయకమైన మ్యూజిక్ వీడియోను కూడా కేంద్ర మంత్రి ఆవిష్కరించారన్నారు. దేశంలో క్రీడలు ఒక భావోద్వేగం అన్నారు. భారతదేశ క్రీడా ప్రతిభను పెంపొందించడం అంటే, దేశాన్ని ప్రపంచ వేదికపై ముందుకు తీసుకెళ్లడమేనన్నారు. ఇండియన్ ఆయిల్ ప్రారంభించిన క్రీడా గీతం క్రీడల పట్ల దేశం అభిరుచిని ఉత్తేజపరిచిందన్నారు.